తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వైభవంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, జూలై 5 ప్రభాతవార్త:
వడమాలపేట భవానీశంకర దేవాలయంలో మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకంను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో మహాశివుని లింగాన్ని పూలమాలలతో సర్వంగా సుందరంగా అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

## భక్తులకు అందుబాటులో టూరిజం హోటల్

తిరుమల, జులై 5ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలలో భక్తుల సౌలభ్యంకోసం పర్యాటకశాఖ నిర్వహించే హోటల్‌ను శుక్రవారం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభించారు. భక్తులకు రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంఎల్ఎ శ్రీనివాసులు, టిటిడి ఈఓ శ్యామలరావు పాల్గొన్నారు.

### తమిళనాడుకు ధీటుగా

# తిరుపతిలో సినీ స్టూడియో

**వైజాగ్ రుషికొండ నిర్మాణాలపై అసెంబ్లీలో చర్చ**
**మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్**




తిరుపతిరూరల్, జూలై 5 ప్రభాతవార్త:
ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో తమిళనాడుకు ధీటుగా సినీ స్టూడియో నిర్మాణానికి తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటశాఖ, సినీటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఓ ప్రవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిపై త్వరలో కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో సినిమా స్టూడియో నిర్మాణం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. బెంగళూరు-చెన్నైకు అనుసంధానంగా తిరుపతిలో సినిమా స్టూడియో నిర్మించి, తెలుగు చిత్ర పరిశ్రమ రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తిరుమల-తిరుపతి-శ్రీకాళహస్తి-కాణిపాకం ఆలయాలు కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి, మౌళిక కల్పించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంత్రిని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వంత జిల్లాలో పర్యాటక అభివృద్ధి ప్రాధాన్యత ఇచ్చి, స్థానికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేసారు. రుయా హాస్పిటల్ సమీపంలో వున్న టూరిజం హోటల్ పనులు పూర్తి చేసి, త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, డిప్యూటీ సి.యం. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత దూషణలకే పర్యాటక రంగాన్ని ఉపయోగించాలరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని కళాకారులను గుర్తించి, పెన్షన్స్ అందజేయుటకు కూటమి ప్రభుత్వం యోచిస్తుందని తెలిపారు. టెంపుల్ టూరిజంతో పాటు ఎకో టూరిజం అభివృద్ధికి సి.యం, చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని మంత్రి తెలిపారు. రుషి కొండపై ఆరువందల కోట్ల రుపాయాలతో నిర్మించిన ఆధునాతన కట్టడంపై త్వరలో అసెంబ్లీలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈవిఎంలపై చర్చ జరగాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అభిప్రాయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడ మాజీ చైర్మెన్ ఎన్వీ ప్రసాద్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరులో వైకాపా ఖాళీ

- ఎమ్మెల్యే గురజాల సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలు
- 'దేశం'లోకి మరో 22 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కో-అప్షన్ సభ్యులు



**ఎమ్మెల్యే గురజాల సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్లు.**

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వైకాపా ఖాళీ అయ్యింది. చిత్తూరు మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డితో పాటు 22 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కో-అప్షన్ సభ్యులు వైకాపాకు రాజీనామా చేసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైకాపా పార్టీ ఆవిర్భావం నుండి చిత్తూరుపై మంచి పట్టు సాధించిన ఆ పార్టీ ప్రస్తుతం అధికార తెలుగుదేశం పార్టీ వ్యూహాలకు కుదేలు అయ్యింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైకాపా ఓటమి పాలవడం, అదే సమయంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. గత ఎన్నికలకు ముందు వరకు చిత్తూరు వైకాపా ఎమ్మెల్యేగా వున్న ఆరణి శ్రీనివాసులుకు పార్టీ అధిష్టానం అభ్యర్థిత్వం నిరాకరించడంతో ఆయన తిరుపతి నుండి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. చిత్తూరు నుండి రాజకీయాల్లో పెద్దగా అనుభవం లేని అభ్యర్థిగా వున్న ఎంసి విజయానందరెడ్డికి వైకాపా అధిష్టానం అభ్యర్థిత్వం కేటాయించింది. చిత్తూరు నుండి తెలుగుదేశం సైతం రాజకీయాల్లో ఏ మాత్రం అనుభవం లేని గురజాల జగన్మోహన్‌నాయుడును అభ్యర్థిగా ప్రకటించింది. తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇటు తెలుగుదేశంకు దూరం అయిన నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందని వారిని సైతం కలుపుకుని వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డిపై విజయం సాధించారు. అయితే వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి ఒంటరి పోరాటం చేసి ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌పై పట్టు సాధించాలని నిర్ణయించిన తెలుగుదేశం పార్టీ మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలకు వల విసిరింది. ఈ మేరకు గత వారం రోజులుగా వీరిని పార్టీలో చేర్చుకోవడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు చేసియ మంత్రాంగం ఫలించింది. ఈ మేరకు శుక్రవారం మేయర్ అముదతో పాటు డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలతో పాటు 22 మంది కార్పొరేటర్లు, మరో ఇద్దరు కో-అప్షన్ సభ్యులు వైకాపాకు రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ మేయర్ కఠారి హేమలతల సమక్షంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలతో పాటు 22 మంది వైకాపా కార్పరేటర్లు, ఇద్దరు కో-అప్షన్ సభ్యులు వైకాపాకు రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

**మేయర్, డిప్యూటీ మేయర్లపై వైకాపా సస్పెన్షన్ వేటు**

వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న చిత్తూరు మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలపై జిల్లా వైకాపా అధ్యక్షుడు కెజెఆర్ భరత్ సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన మరో 22 మంది వైకాపా కార్పొరేటర్లు, ఇద్దరు కో-అప్షన్ సభ్యులపై జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ సస్పెన్షన్ వేటు వేశారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిధుల తాకిడి

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం శుక్రవారం ఓ వైపు భక్తులతో మరో వైపు అతిధుల తాకిడితో కిట కిటలాడింది. సాధారణంగానే శుక్రవారం ఆలయానికి రద్దీ అధికంగా ఉంటుంది. అలాంటిది ఈ శుక్రవారం అమావాస్య వచ్చింది.దాంతో భక్తుల తాకిడి పెరిగింది. అధికారులు అందించిన సమాచారం మేరకు సాయంత్రానికి 20వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. ఇకరాహుకేతుదోష నివారణ పూజలు 4500 జరిగినట్లు ప్రకటించారు.అంతేకాక సంస్కరణలతో ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశిస్తున్న భక్తుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ నేపధ్యంలో శుక్రవారం సుమారు 4వేల మంది ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.సాయంత్రం నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 45 జరగగా స్వామి అమ్మవార్ల అభిషేకాలు 92 జరిగినట్లు పేర్కొన్నారు.

### వరసిద్ధుని దర్శించుకున్న

# అమరావతి రాజధాని రైతులు



**కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన అమరావతి రైతులు**

కాణిపాకం, జూలై 5 ప్రభాతవార్త:
నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులు సుమారు 150 మంది శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. అమరావతి ఏకైక రాజధాని కావాలని కోరుతూ 1630 రోజుల పాటు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేసిన అమరావతి ప్రాంత రైతులు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో రాష్ట్రంలోని ఆలయాల్లో మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా తిరుమల దర్శనానంతరం ఆలయ దర్శనార్థం కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వచ్చిన వారికి ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు, దనంజయ యాదవ్, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, జయచంద్రలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**అమరావతిలో చీకటిపోయి వెలుగులు వచ్చాయి: రైతు నాయకులు**

గత సీఎం జగన్ తీసుకున్న మూడు రాజధానుల ఏర్పాటు అనాలోచిత నిర్ణయాల కారణంగా అమరావతి ప్రాంత రైతులు 1630 రోజుల పాటు నిరాంతరాయంగా ఎన్నో ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఉద్యమ కాలంలో జగన్ ప్రభుత్వం తమపై ఎన్నో రకాల నిర్భందాలు, వేధింపులకు పాల్పడిందని తెలిపారు. ప్రభుత్వ వేధింపుల కారణంగా 272 మంది అమరావతి ప్రాంత రైతులు అసువులు బాశారని వారు పేర్కొన్నారు.అలాగే అమరావతి రాజధానిపై గత ప్రభుత్వం విషప్రచారం చేసిందని, దీన్ని ఉద్యమంలో వున్న రైతులు పాదయాత్రల ద్వారా ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు.

# బాధ్యతలు చేపట్టిన 24 గంటల్లోనే జనం సమస్యలపై ఫోకస్

**తిరుపతి జిల్లానూతన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉరుకులుపరుగులు**



తిరుపతి, జులై 5ప్రభాతవార్తప్రతినిధి:
మురికినీటితో పేరుకుపోయిన కాలువలు...ఇళ్ళముందు చెత్తా చెదారం.... పాచిపట్టిన నీళ్ళతో ఇళ్ళముందు నిండిన తొట్టెలు... ఇళ్ళలోని ఎయిర్‌కూలర్‌ల నుండి వెలుడిన నీరు నిల్వ వాటిపై ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయనో జిల్లా కలెక్టర్ అనే విషయం తిరపతి వాసులకు కూడా తెలియకముందే తన బాధ్యతలు అందరికీ ఆదర్శంగా నిర్వహించేలా ఏకంగా తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఉదయం నగరపాలకసంస్థ అధికారులను ఉరుకులుపరుగులు పెట్టించారు. అప్పటివరకు నూతన కలెక్టర్ వచ్చారులే అని అనుకుంటూ రోజువారీగా విదులకు సిద్ధమవుతున్న తిరుపతి జిల్లాకేంద్రంలోని డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, నగరపాలకసంస్థ కమిషనర్ అధితి సింగ్, తిరుపతి నగరపాలక ఆరోగ్యఅధికారికి జిల్లా కలెక్టర్ నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూతవేటు దూరంలోఉన్న స్కావెంజర్స్ కాలనీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో అధికారుల్లో రైళ్ళు పరుగెత్తాయి. అంతేగాక ఏకంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వర్ 24గంటల్లోనే ఎవరూ ఊహించని రీతిలో స్వయంగా జనంలో కలసి పోయి ఆకస్మిక తనిఖీలు చేయడంతో ప్రభుత్వ అధికారులు దిక్కుతోచని స్థితిలో నిలబడిపోయారు. కాలనీల్లో ఇంటింటికెళ్ళి ఇళ్ళముందు మురికికాలువల్లో నీరు నిలచిపోవడం, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం, ఇళ్ళముందు తొట్టెల్లో నీరునిలచిపోయి ఉండటం, దోమలు వ్యాప్తి, డెంగ్యూబారిన పడిన బాలుడ్ని పలకరించడం అన్నీ చకచకా జరిగిపోయాయి. ఒకరేమిటి చిన్నపిల్లల నుండి బాలింతలు, వృద్ధులు, మహిళలను అందరినీ ఆప్యాయంగా పలకరించి సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్యసదుపాయాలు అందుతున్నాయా?అంగన్‌వాడీ టీచర్ల పనితీరు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పనితీరుపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రజలకు రక్షిత మంచినీరు అందించేలా చూస్తామని, నీటి పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డయేరియా బారిన వారు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు వాడేలా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫ్రైడే డ్రైడేను పక్కాగా నిర్వహించాలని, అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని నూతన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నిర్ధేశం చేశారు. సిఎంగా చంద్రబాబు సమస్యలపై ఉరుకులు పరుగులు పెట్టించేలా నూతన జిల్లా కలెక్టర్ పనితీరు ఉండటంతో అధికారుల్లో హడలెత్తుతోంది.

# అభివృద్ధికి ప్రతిపాదనలు !!

**ఆలయాలను పరిశీలించిన దేవాదాయశాఖ అధికారులు**



**ఆలయాలను పరిశీలించి నేతలతో చర్చిస్తున్న దేవాదాయ అధికారులు**

కుప్పం/శాంతిపురం/ రామకుప్పం, జూలై 5 ప్రభాతవార్త
కుప్పం మండలంలోని ప్రముఖ ఆలయాలను శుక్రవారం దేవదాయ శాఖ సహాయ కమీషనర్ ప్రసన్న లక్ష్మి, డిఇ చక్రధర్ రావు, ఎఇ ఆనంద్, డిప్యూటీ స్థపతి నెహ్రూ, సహాయ స్థపతి దుర్గా ప్రసాదరావు, ఇఓ కమలాకర్ పరిశీలించారు. కుప్పం మండలంలోని కంగుంది శ్రీ వేణుగోపాలస్వామి, దుర్గంలోని ఆలయాలను అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం అధికారులకు వివరించారు. కార్యక్రమాల్లో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, సర్పంచ్ ధనశేఖర్, నేతలు సత్యేంద్రశేఖర్, చెక్కునత్తం మణి, పార్థ, తిరుపతి, సుబ్బు,వల్లెప్ప, మహేంద్ర, దివాకర్, శరవణ, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం శ్రీబేటరాయస్వామి కింద ఆలయాన్ని దేవదాయ అధికారులు పరిశీలించారు.

**శాంతిపురం :** శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామాలయాన్ని అధికార బృందం పరిశీలించారు. శిథిలదశకు చేరిన ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఖాళీ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిఇ చక్రధర్‌రావు, ఎఇ ఆనంద్, స్థానిక నేతలు మణి, బిఎం కుమార్, బసవరాజు, జయరాజ్, ఎంఆర్ నారాయణ, మురళి, రాము, నడింపల్లి సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని శుక్రవారం డిఇ చక్రధర్ రావు, దేవదాయ శాఖ స్థపతి నెహ్రూ, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, రామూర్తి, పట్రనారాయణ, మనోహర్, రామకృష్ణ, చిన్నికృష్ణ ఇఒలు చలపతి, కమలాకర్ పాల్గొన్నారు.

### పండిన పంట పొలాలే

# స్మశానానికి దారి!



**పండిన వరి పంట పొలాం మీదుగా శవాన్ని పాడిమీద తీసుకెలుతున్న దృశ్యం**

ఏర్పేడు, జూలై5, ప్రభాతవార్త;
మండలంలోని మర్రిమంద హరిజనవాడలో ఎవరైనా శనిపోతే శ్మశానానికి దారి లేక పండిన పంట పొలాల మీదు పాడెను మోసుకెళ్లాల్సిందే. శుక్రవారం మర్రిమంద హరిజన వాడలో భవనాసి సుబ్రమణ్యం మృతి చెందాడు. ఆయనను దహనక్రియలు జరిపేందకు పండిన వరి పంట పొలాల మీదుగా అవస్థలు పడుతూ తీసుకెళ్లారు. ఇలాంటి సమస్య మళ్లీ పునావృతం కాకుండా నాయకులు, అధికారులు చర్యలు చేపట్టాలని మర్రిమంద హరిజనవాడ ప్రజలు కోరుతున్నారు.

# నిత్యోత్సవాలతో సంబరాలు : జ్ఞానమ్మకు ప్రత్యేకాలంకారాలు

శ్రీకాళహస్తి జూలై 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వాయులింగేశ్వరుని సన్నిధిలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు,అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక శుక్రవారం అమ్మవారికి బంగారు చీరతో ముస్తాబు చేసి వజ్రకిరీటాన్ని అలంకరించారు.ఇటీవల ఆలయానికి అతిధుల తాకిడి అధికంగా ఉంటుంది. శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబఅమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితిగా ఉంది.ఈ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది.

**నిత్యోత్సవం భక్తులకు సంబరం:**

శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయ స్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకళ్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక శుక్రవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది.



**శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం**

ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం,మృత్యుంజయ స్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బంగారు చీర, వజ్రకిరీటంతో పాటు సాయంత్రం బంగారు పుష్పాలతో అభిషేకం ప్రత్యేకార్షణగా మారింది.ఈ సేవలకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. అయితే అమ్మవారికి బంగారుపుష్పాల అభిషేకానికి దేవస్థానం అధికారులు అంతగా ప్రచారం చేయలేదు.దాంతోఈ సేవలకు స్థానికులు మాత్రమే హాజరౌతున్నారు. అంతేకాక మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకానికి ఇచ్చినట్లు వారంలో ఒక్క రోజు నిర్వహించే పూజలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

ఎనలేని మధురానుభూతి:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురానుభూతి కల్గుతుంది.ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహాత్మ్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆద్మాత్మిక చింతన కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది.గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు.

# అభివృద్ధే ఏకైక లక్ష్యంతో ముందడుగు

**- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలసి వచ్చే వారిని కలుపుకుని అందరి సహకారంతో చిత్తూరు అభివృద్దే ఏకైక లక్ష్యంగా ముందుకెళ్ళాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశభవనంలో శుక్రవారం మేయర్ అముద అధ్యక్షతన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ చిత్తూరు మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించడం జరిగిందని, నగర నడిబొడ్డులో వున్న కూరగాయల మార్కెట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నగరంలోని అనువైన ప్రాంతాల్లోను ప్రజల సౌకర్యార్థం మార్కెట్లు, రైతు బజార్లు, మామిడికాయల మండిని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలోని ప్రతి ఇంటికి మంచినీరు సరఫరా చేయడానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో అభివృద్ధి చేస్తున్న మార్కెట్‌లో చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని మండలాల రైతులకు తగిన అవకాశం కల్పించాలని కోరారు. చిత్తూరు నగర మార్కెట్‌ను ఇంటిగ్రేడెట్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడం అభినందనీయమని, ఇదే సమయంలో ఇతర



మండలాల రైతులకు అవకాశం కల్పించాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌పై కమీషనర్ డాక్టర్ జె.అరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు. చిత్తూరు చర్చివీధిలోని పాత కూరగాయల మార్కెట్‌లో కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌ను అధునిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లో ప్రస్తుతం వున్న పరిస్థితులు, స్థలాభావం, పార్కింగ్ కొరత, ట్రాఫిక్, పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు తెలియజేస్తూ ఆధునిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడం ద్వారా అందుబాటులోకి వచ్చే సౌకర్యాలను ఆమె వివరించారు. నిత్యవసరాలు, ఇతర కూరగాయలకు వేరు వేరుగా దుకాణాలు కేటాయింపు నమూనాలు, మటన్, ఫిష్ కోసం ప్రత్యేక దుకాణాలు, టాయిలెట్స్, ధరల డిస్‌ప్లే బోర్డులు, బాలింతలకు ఫీడింగ్ రూమ్, వర్షపు నీటి నిర్వహణ, పార్కింగ్ సదుపాయం, గ్రీనరీ వంటి సదుపాయాలతో మార్కెట్ సరికొత్త రూపురేఖలపై ఆమె ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, ఎన్.రాజేష్‌కుమార్‌రెడ్డిలు, అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు

గురజాల, డాక్టర్ మురళీమోహన్‌లు ప్రమాణస్వీకారం

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎక్స్ఆఫిషియో సభ్యులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్‌లు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. చిత్తూరు మున్సిపల్ ఎక్స్ఆఫిషియో సభ్యులుగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అప్షన్‌లు పెట్టుకున్నారు. ఎక్స్ఆఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లను కమీషనర్ డాక్టర్ జె.అరుణ సన్మానించారు.





## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం చిత్తూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు ఆర్‌అండ్‌బి అతిధిగృహంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆయనకు పుష్పగుచ్చం అందించి తన నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

## మిగులుభూములపై రైతులకు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు - తహశీల్దార్

కుప్పంరూరల్, జూలై 5 ప్రభాతవార్త



కుప్పం మండలంలో ఆధార్ వివరాలు అందించలేని రైతులకు చెందిన భూములు మిగులు భూములుగా రికార్డుల్లో ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ భూములపై తిరిగి ఆయా రైతులకు హక్కులు కల్పించేందుకు గాను రైతులనుంచి దరఖాసు_లు సీ ్వకరించడం జరుగుతుందని తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. 2021సం॥లో ఆధార్ సీడింగ్ లేని కారణంగా మండలంలోని 31 గ్రామాల్లో సుమారు మూడువేలకు పైగా ఖాతాలు మిగులు భూముల కింద చేరిపోయాయన్నారు. ఈ నేపథ ్యంలో ఇలాంటి రైతులు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం పొందలేకపోయారన్నారు. నేపథ్యంలో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఆయా భూములపై రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించేందుకు గాను దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రైతులు సంబంధిత విఆర్వోలను కానీ రెవెన్యూ కార్యాలయంలో కానీ సంప్రదించి పూర్తి వివరాలతో దరఖాస్తులు అందిస్తే వాటిని నివేదిక రూపంలో జిల్లా కలెక్టరుకు పంపించడం జరుగుతుందన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

కుప్పంరూరల్, జూలై 5 ప్రభాతవార్త



మండలంలోని పైపాళ్యం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం తరపున దేశం నేతలు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, మొదలియార్ సాధికారసమితి అధ్యక్షుడు మునిరత్నం, గ్రామపెద్దలు స్వామినాథన్, భరణి, గోవిందస్వామి, దాము, పిసి ఛైర్మన్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రహదారి అక్రమణల తొలగింపు

- తహసిల్దారుకు గ్రామస్తుల వినతి

పెనుమూరు, జులై 5 ప్రభాతవార్త:



తమ గ్రామ రహదారి ఆక్రమణలకు గురైందని, అక్రమణలను తొలగించాలని మండలంలోని తిప్పారపల్లి పంచాయతీలోని గంధపూడివారిపల్లి గ్రామస్తులు శుక్రవారం తహసిల్దారు సుభద్ర, ఎస్ఐ లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఆర్‌సి పురం, గంధపూడివారిపల్లి రహదారి ఆక్రమణలకు గురైందని, నెల రోజుల క్రితం తహసిల్దారుకు వినతి చేశామని ఆమె వెంటనే గ్రామస్తులు, పోలీసుల సమక్షంలో రహదారి సర్వే చేసి ఇరు ప్రక్కల సరిహద్దు రాళ్ళు నాటించడం జరిగిందన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా రాళ్ళను తొలగించారని ఈ విషయమై తహసిల్దారుకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులతో పాటు సర్వేయర్ ప్రకాష్ రహదారి వద్దకు రాగా ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తి సర్వేయర్‌ను దుర్భాషలాడి అవమానించి పంపారన్నారు. ఆ వ్యక్తి రహదారిని అక్రమించి రోడ్డుపైనే వ్యవసాయ బోరు, పశువుల పాక నిర్మించడం జరిగిందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టామని హెచ్చరించారు. తహసిల్దారును కలిసి విన్నవించిన వారిలో మొరం త్యాగరాజులు, రాజగోపాల్, మునీంద్ర, రమేష్, ప్రకాష్, గీత, నాగమణి, వాసు, దేవరాజులు, తులసీ, విజయ తదితరులు వున్నారు.

## భవిష్య నిధి లెక్కలు తేల్చండి

- జడ్పీ సిఇఓ గ్లోరియాకు ఎస్టీయు నాయకులు వినతి

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
ఉద్యోగ, ఉపాధ్యాయులు నెల నెల జీతాల నుండి పొదుపు చేస్తున్న భవిష్యనిధి మొత్తాల వివరాలను పారదర్శకంగా బహిర్గతం చేయాలని ఎస్టీయు నాయకులు డిమాండ్ చేశారు. జడ్పీ సిఇఓ ఛాంబర్‌లో జడ్పీ సిఇఓ గ్లోరియాతో శుక్రవారం ఎస్టీయు నాయకులు గంటామోహన్, మదన్‌మోహన్‌రెడ్డి, బి.మోహన్, పురుషోత్తంనాయుడు, హేమచంద్రరెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు కలిసి జడ్పీ పిఎఫ్ మొత్తాలపై చర్చించారు. వారు సిఇఓతో మాట్లాడుతూ కోట్లాది రూపాయల పిఎఫ్ మొత్తాల వివరాలు దాచి పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పిఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో రుణాలు పొందడంలోను, పదవి విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తుది మొత్తాలు పొందడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ఆకాల మరణం పొందిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వడంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, గత రెండేళ్ళుగా కారుణ్య నియామకాలకు సంబంధించిన వ్యవహారాలపై పునఃసమీక్షించాలన్నారు. రాజకీయ పలుకుబడి లేని వారికి ఇబ్బందులు కలిగించే విధంగా సుదూర ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో పోస్టింగ్స్ ఇచ్చారన్నారు. పెండింగ్‌లో వున్న కారుణ్య నియామకాలను ఖాళీగా వున్న ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), జూలై 5 ప్రభాతవార్త
శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగా వించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద పండితులచే జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ అధికారులు, అర్చక, సిబ్బంది భక్తులకు వసతులు సమకూర్చారు.

## నిలిచిన సామాజిక పెన్షన్లు పంపిణీ

సోమల, జులై 5, ప్రభాతవార్త



ప్రతి నెల 1వ తారీఖున ప్రభుత్వం పంపిణీ చేసే సామాజిక పెన్షన్లు అనివార్య కారణాలతో కొన్ని నిలిచిపోయాయి. సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయితీలో దాదాపు 15 వరకు పెన్షన్లు పంపిణీ నిలిచిపోయాయి. తెలుగుదేశం పార్టీ మండల జనరల్ సెక్రటరీ మునీశ్వర రావు చొరవతో శుక్రవారం అందరికీ పెన్షన్లు అందించారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, డిజిటల్ అసిస్టెంట్ హరీష్‌ల ఆధ్వర్యంలో మునీశ్వర రావు పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏడు వేల రూపాయిలు వంతున ఒక్కొక్కరికి పంపిణీ చేశారు. పేదల పక్షపాతి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఎన్డీఏ మిత్రబక్షాలైన జనసేన, బిజెపి నాయకులను సమన్వయం చేసుకొని పంచాయితీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన అన్నారు.

## హెచ్‌ఆర్‌పిఎం జాతీయ సమన్వయకర్తగా మురుగేషన్

చిత్తూరురూరల్, జూలై 5 ప్రభాతవార్త:



చిత్తూరు నగరానికి చెందిన కె. మురగేషన్‌ను హ్యూమన్ రైట్స్‌ప్రొటెక్షన్ మిషన్ జాతీయ సమన్వయకర్తగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉప్పు రవిని ఎన్నుకొన్నట్లు జాతీయ అధ్యక్షుడుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా మానవ హక్కులను పరిరక్షించడంతో పాటు మానవహక్కుల ఉల్లం ఘన బాధితులకుఅండగావుంటామనిమురగేషన్,రవిలుపేర్కొన్నారు

## .గోశాల నుండి రైతులకు ఉచితంగా కోడెలు, కోడెదూడలు

కాణిపాకం, జూలై 5 ప్రభాతవార్త:
రాష్ట్ర దేవాదాయశాఖ అదేశాల మేరకు కాణిఆపకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం గోశాలలోని కోడెలు, కోడెదూడలను ఉచితంగా పరిసర ప్రాంతాల రైతులకు అందజేయనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. హిందూ మతమునకు చెందిన రైతులకు ఉచితంగా వ్యవసాయసాగు కోసం కోడెదూడలను అందజేయనున్నట్లు తెలిపారు. అసక్తి రైతులు ధరఖాస్తుతో పాటు వ్యవసాయ బూమి వున్నట్లు పట్టాదారు పాసుపుస్తకము, ఆథార్‌కార్డు, స్థానికతను తెలియజేసేందుకు విఆర్ఓ ద్వారా సర్టిఫికేట్, వ్యవసాయం చేస్తున్నట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసిన సర్టిఫికేట్, 100 రూపాయలు విలువ గల జ్యుడీషియల్ స్టాంపులో అఫిడివిట్‌ను దేవస్థానం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు దేవస్థానం కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

## వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు తగవు

పెద్దపంజాణి, జూలై 5 ప్రభాతవార్త :



మండలంలోని గోనుమాకులపల్లి చామనేరు పంచాయతీ గ్రామరెవిన్యూ సహాయకుడు మునెప్ప దేశంనా యకుల వేధింపులతోనే మృతిచెందాడని కొంతమంది వైసీపీ నాయకులు చేస్తున్న అసత్యప్రచారాన్ని మానుకోవాలని మాజీ ఇంటలిజెన్స్ అధికారి సుబ్రమణ్యం రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.మునెప్ప కొంత కాలంగా పక్షవాతం రావడంతో చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారన్నారు.అయితే టీడీపీ నేతలు ఫోన్‌చేసి బెదిరించడంతోనే మునెప్ప మృతిచెందినట్లు వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారం తగదని పేర్కొన్నారు. ప్రశాంతతకు మారుపేరైన గ్రామాల్లో వైకాపానాయకులు స్వార్థ రాజకీయాలకోసం ఇలా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన హితవుపలికారు.దేశం నేతలపై వైకాపానేతలు చేస్తున్న తప్పుడుప్రచారాన్ని ఆయనఖండించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రెడ్ సంస్థ సేవలు అభినందనీయం

డాక్టర్ రోహిణి



గూడూరు, జులై 5, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని త్యాగరాజా వీధి లోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా నిర్మల (అమరావతి హాస్పిటల్స్ - గూడూరు) వ్యవహరించి ఐదు వేల రూపాయిలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణి పాల్గొని దివ్యాంగులకు ఫల సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా రెడ్ సంస్థ దివ్యాంగులకు ఫల సరుకులు అందజేయడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ రెడ్డి, కార్యదర్శి అనిత సభ్యులు స్నేహలత రెడ్డి, శశిరేఖ, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, మెదురు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

## 10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వెంకటగిరి, జులై 5, ప్రభాతవార్త
మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేది ఉదయం 10.30 గంటలకు ఎంపిపి తనుజ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడివో నీలకంఠేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు, సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## ప్రైవేట్ పరిశ్రమల యాజమాన్యంతో సమావేశం

చిల్లకూరు, జులై 5, ప్రభాతవార్త



చిల్లకూరు గ్రామంలోని పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ శ్రీ తానంకి నానాజీ స్వగృహంలో శుక్రవారం గూడూరు నియోజకవర్గంలోని వివిధ ప్రైవేట్ పరిశ్రమల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిశ్రమలలో స్థానికంగా ఉన్నటువంటి నిరుద్యోగులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో నియోజకవర్గ పరిధిలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. పరిసరాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా కల్పించాలని పరిశ్రమల యాజమాన్యానికి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత తానంకి నానాజీ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చురు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ద్విచక్రవాహన దొంగల అరెస్ట్

వి.కోట, జులై 5 ప్రభాతవార్త:
ఇద్దరు ద్విచక్రవాహన దొంగలను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది.వి.కోట మండలం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ లింగప్ప,ఎస్ఐ బాబు వారి బృందం పాపేపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్రవాహనంలో ఇద్దరు వస్తు పోలీసులను గమనించి ఆపకుండా తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి ఇద్దరిని అదుపులో తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించడం జరిగింది.విచారణలో తమిళనాడు రాష్ట్రం,తిరుపత్తూరు జిల్లాకు చెందిన ప్రభు(25),కార్తీక్(25) ద్విచక్రవాహనాల దొంగతనాకు చేస్తునట్లు దొంగలించిన తొమ్మిది ద్విచక్రవాహనాలను తమిళనాడు రాష్ట్రం పెర్నంబటు సమీపంలో దాచినట్టు పోలీసులకు తెలపడంతో అక్కడికి వెళ్ళి ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డిఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడూతూ చిన్న వయస్సులోనే జల్సాలకు అలవాటు పడి ఇలా ద్విచక్ర వాహనాలు దొంగతనాలు పాల్పడుతున్న యువకులు వాళ్ల భవిష్యత్తులో నాశనం చేసుకోకూడదని డిఎస్పీ సూచించారు.ఈరోజు పట్టుబడ్డ యువకులు కూడా చిన్న వయసులో ఉన్న వాళ్ళే అని తెలిపారు. ఈ మేరకు ప్రభు(25),కార్తీక్ (25) రిమాండ్‌కు తరలించారు.

# జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయండి

**ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వహకుడు డాక్టర్ సుఖదేవ్**

గూడూరు, జులై 5, ప్రభాతవార్త
నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదిన గూడూరు పట్టణంలో పదవ జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వాహకుడు డాక్టర్ సుఖదేవ్ తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణం సొసైటీ ప్రాంతంలో ఉన్న గూడూరు ఇస్కాన్ ప్రచార కేంద్రం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలో పూరిలో జగన్నాథ రథయాత్ర నిర్వహించే కార్యక్రమానికి అనుగుణంగా గూడూరు



పట్టణంలో గత తొమ్మిది సంవత్సరాల నుండి జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జులై 13వ తేది గూడూరు పట్టణంలో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. రథయాత్రకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక భక్తులు సహకారం అందించాలని వారి విజ్ఞప్తి చేశారు.

## గూడూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

గూడూరు, జులై 5, ప్రభాతవార్త



గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిల్లకూరు మండలం ముత్యాలపాడు లోని ప్రాథమిక పాఠశాల నందు పిల్లలకు మంచినీరు త్రాగుటకు ప్యూరిఫైయర్ అందజేశారు. గూడూరు బాలసదను నందు వాషింగ్ మిషన్‌ను అందజేశారు. లయన్స క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర సభ్యులు సహకారంతో ఇవ్వడమైంది. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అధ్యక్షులు రవిచంద్ర క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. ఈ సంవత్సరం కూడా రవిచంద్ర రెడ్డిని అధ్యక్షులుగా శివయ్యనుగా సెక్రటరీగా వీరేంద్రనాథ్‌ను ట్రెజరర్‌గా కొనసాగించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మల్లెమాల మురళి రెడ్డి భయ్యా రవికుమార్ గూడూరు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు సోమిశెట్టి సంచురామయ్య జక్కం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కళ్యాణ సాయి జగదీష్ రూపేష్ రెడ్డి మదనమేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళమెడలో చైన్ అపహరణ ...

పోలీసులు కేసునమోదు ...

దొరవారిసత్రం జూలై 5 ప్రభాతవార్త_;
మండలంలోని టపాయిండ్లు సమీపంలో జాతీయరహదారి పక్కన ఓచిల్లర దుకాణంలో ఉన్న నర్రా నీలాంబిక అనే మహిళ మెడలో గుర్తుతెలియని దుండగులు బంగారు చైన్ లాక్కొని పారిపోయినట్లు బాధితురాలు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న ఎస్సై తిరుమలరావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. టపాయిండ్లు గ్రామానికి చెందిన నీలాంబిక టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కన చిల్లరదుకాణం నిర్వహిస్తుంది.నీలాంబిక ఒంటరిగా దుకాణంలో ఉన్న సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం వద్దకు వచ్చి చిగరెట్ కావాలంటూ వచ్చి ఒక్కసారిగా మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాకొని అక్కడ నుండి పరారైనట్లు బాదితురాలు తెలియజేశారు.బంగారు చైన్ సమారు 3సవర్లు ఉంటుందన్నారు.దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ఉచ్చూరు జన్మదిన వేడుకలు

చిల్లకూరు, జులై 5, ప్రభాతవార్త



చిల్లకూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను శుక్రవారం చిల్లకూరులోని ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ జ్యోతి వే బ్రిడ్జి వద్ద మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రముఖ పారిశ్రామికవేత్త తనాంకి నానాజీలు, వెంకటేశ్వర్లు రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు గంగా ప్రసాదు నానాజీలు సూచనలు, సలహాలు మేరకు మండలంలోని తెలుగుదేశం కుటుంబ సభ్యులు అందరికి అన్ని వేళ అందుబాటులో ఉంటూ పార్టీకి నాయకులకు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాలు లీలావతి నాయకులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మూగ శంకరయ్య మేఘనూరు వెంకటకృష్ణయ్య, మేకల కుమార్, గుండాల శ్రీనివాసులు, చిట్టేటి శ్రీనివాసులు పెనుబోలు జానకిరామ్ రెడ్డి, దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి, రావుల వెంకటేశ్వర్లు, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు, పసల వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రామకుప్పం, జూలై 5 ప్రభాతవార్త



ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రమీలరాణి, పరిశోధకులు సుమతి పేర్కొన్నారు. శుక్రవారం విజలాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వేరుసెనగ పంటను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు, ప్రభుత్వం ద్వారా అందే ఎరువుల రాయితీలను వివరించారు. కార్యక్రమంలో రెడ్డిరాము, రాజేష్, ఎఒ అమృత, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

# మండల పరిషత్‌లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం సహించం

**- టిడిపి ఎంపిటిసిల హెచ్చరిక**

కోట, జులై 5 ప్రభాతవార్త
మండల పరిషత్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు ఇంకా వైసీపీ నాయకులతో అంటకాగుతున్నారని తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపిటిసి సభ్యులు షేక్ షంషుద్దీన్, దారా సురేష్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్ ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు వారు పలు ప్రశ్నలు సంధించారు. గత ఐదేళ్లుగా మండల పరిషత్ నిధులు ఎంత మంజూరయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేశారో అందుకు సంబంధించిన లెక్కలు



రహిత పాలన అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నాయకత్వంలో మండలంలో పారదర్శకమైన పాలన ప్రజలకు అందిస్తామన్నారు. వారి వెంట జిల్లా టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ బాషా తదితరులు ఉన్నారు.

## గతుకుల రోడ్డును పూడ్చివేసిన వైనం



తొట్టంబేడు, జూలై 5 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గతులకు మయం కావడంతో వార్త దినపత్రికలో 'గతుకులకు అతుకులు కొద్దిరోజులే' అన్న శీర్షికన రెండు రోజుల క్రితం వార్త ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు గుంతలను పూడ్చికొత్తగా రోడ్డును వేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న సిసిరోడ్డు మధ్యలోఉన్నగుంతలనుపూడ్చివేయడంతో వాహనచోదకులకు కాస్తా ఉపశమనం కలిగిందని చెప్పవచ్చును.

## ప్రతిపక్ష హోదా లేదని నాటకాలు వేస్తున్న జగన్

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త



గడచిన ఐదు సంవత్సర కాలంలో తనకుంటూ ఓ ప్రత్యేకమైన చట్టాన్ని అనుసరిస్తూ ఆటవిక సూత్రా ల ఆధారంగా రాక్షస పాలన సాగించి అధికారం కోల్పోగానే ధర్మపాలకుడిగా జగన్ నాటకాలు వేస్తున్నాడని తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు. పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ విధ్వంసకారులు చేసే దాడులు, దౌర్జన్యాలను చూసి పైశాచిక ఆనందాన్ని పొందిన జగన్‌రెడ్డి బాబాయ్ హత్యకేసును పట్టించుకోదు కానీ తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న జగన్ ఇవిఎం విధ్వంసకారుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలుకెళ్లి పరామర్శించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తెదేపా బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, నాయిబ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి నాయకులు మునిరాజయాదవ్, భాస్కర్, మణి, శివ, గణేష్, జిలానీ, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాల పరిశీలించిన జిల్లా అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ కార్యాలయ పరిధిలో ఉన్న భవిత కేంద్రాలును జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఐఈఆర్‌టి కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డిలు మండలంలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు పనుల పర్యవేక్షణ అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలోని భవిత కేంద్రం పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు.నాడు నేడు పనులను పూర్తిచేసే విధంగా భవిత కేంద్రాలకు సంబందించి ఇంత వరకు జరిగిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో గుర్తించిన పిల్లలను వెంటనే భవిత కేంద్రాల్లో వారిపేర్లను నమోదు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన పిల్లలకు విద్యాసామగ్రి

శ్రీకాళహస్తి రూరల్,జూలై 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం భైరవ ఎస్‌టి కాలనీలో శుక్రవారం విద్యాసామగ్రిని అందించారు.యువనేస్తం అసోసియేషన్ సారధ్యంలో అయియా 74వ ఆవిర్భావ వారోత్సవం సందర్భంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. గిరిజన కాలనీలో 40 మంది విద్యార్థులకు శ్రీకాళహస్తిలోని ఎల్‌ఐసి బ్రాంచి యూనియన్ కార్యదర్శి సురేష్‌బాబు అందించారు. ఈ కార్యక్రమాలను యువనేస్తం అధ్యక్షుడు మునిశేఖర్ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్‌కు సంబంధించి సాయి గోపినాథ్,జహంగీర్,శ్రీనివాసులు, ఆనంద్,వెంకటేష్, వెంకటేశ్వర్లు,రాజంద్ర ప్రసాద్, మునెమ్మ, నాగమణి, వెంకటేష్, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు

## నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం:

శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. ఇక్కడ నిర్వహణ చూసిన ప్రతి భక్తుడు విరాళం అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం గుంటూ రుకు చెందిన ఏ శివశంకర్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. పిఆర్‌ఓ నాగభూషణం నాయక్‌ను తాము నిత్యాన్న ప్రసాదానికి విరాళం ఇవ్వాలని తెలిపారు. రజనీ పోతుపేర ప్రతి ఏడాది ఫిబ్రవరి 2వ తేది నిత్యాన్న ప్రసాదంలో భక్తులకు సేవలందించాలని కోరుతూ రూ.లక్ష చెక్కును ఆలయ ఇఒ మూర్తికి అందజేసారు.

## ఆడబిడ్డల చదువు వారి భవిష్యత్తుకు పునాదులు..డిఎస్పీ

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త



ఆడబిడ్డల చదువు వారి భవిష్యత్తుకు పునాదులని నేటి కంప్యూటర్ ప్రపంచంలో మహిళలకు పలు ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు ను నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు టి.జయసుధ ఆధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా డిఎస్పీ ఉమామ హేశ్వరరెడ్డి, అర్బన్ సిఐ నరసింహారావు మరియు మహిళా ఎస్ఐ అరుణలు హజరయ్యారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఆడబిడ్డల చదువు వారికే కాక ఆ కుటుంబానికి వెలుగునిస్తుందని ప్రతి ఒక్కరు డిగ్రీ వరకు చదువుకోవాలని కోరారు. అలాగే బాల్యవివాహాలు జరగకుండా నిరోదించాలని సెల్‌ఫోన్‌లను మంచికోసమే వాడుకోవాలని తెలియజేశారు. సిఐ నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలను గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. బ్రిటీష్‌కాలం నాటిద చట్టాలపై ఐపిసిల స్థానంలో భారతీయ న్యాయ సంహిత వాటిని తీసుకురావడం జరిగిందనానరు. మనిషి ఎదుగుదలకు విద్యే మూలకారణమని ప్రతి ఒక్కరు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. మహిళా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. ప్రతి ఒక్కరు ఆత్మస్థైర్యంతో ఉండాలని కౌమారదశలో వచ్చే మార్పులకు లోనై అబ్బాయిల మాయమాటలు నమ్మి ఎవ్వరు మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిఎస్. గోపాలకృష్ణ, సౌభాగ్యలక్ష్మి, మహిళా పోలీసులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమీకృత బాలుర వసతి గృహం రూపురేఖలు మారాలి

పనులు పరిశీలించిన రిషితారెడ్డి



శ్రీకాళహస్తి జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రి కి ఎదురుగా ఏర్పాటు చేసిన బాలుర సమీకృత వసతి గృహం రూపు రేఖలు మార్చుతామని సకల సదుపాయాలతో పూర్వవై భవాన్ని తీసుకువస్తామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి వివరించారు. శుక్రవారం ఆమె ఈ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు.గతంలో ఈ హాస్టల్‌కు సంబంధించి బొజ్జల బృందమ్మ చొరవ చూపారు. ఇక్కడ విద్యార్థులకు సదుపాయాలతో పాటు విద్యను అందించుటకు అవసరమైన కల్పించారు.గత ఐదేళ్ళుగా ఈ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పలు సమస్యలతో 11కు చేరింది. కారణం ఇక్కడ నుంచి విద్యార్థులు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు సుమారు 3కిలో మీటర్లు వెళ్ళాలి. వాహన సదుపాయం లేకపోవటంతో ఇక్కడ విద్యార్థులు నిలిచి పోయారు.గత నెల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే బొజ్జల బృందమ్మ ఆకస్మికంగా తనికీ చేసారు.ఇక్కడ సదుపాయాలకు సంబంధించి వాకబు చేసారు.

**యుద్ధ ప్రాతిపదికపై మరమ్మత్తులు:**

శ్రీకాళహస్తిలోని సమీకృత బాలుర వసతి గృహానికి మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి జరుగుతుంది. ఈ నేపథ్యంలో గత వారం బృందమ్మ పరిశీలించిన తరువాత మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను శుక్రవారం రిషితారెడ్డి పరిశీలించారు. పరిశీలనల్లో రిషితారెడ్డితో పాటు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు ఉన్నారు

## తిరుపతిలో పిఎన్జి కార్యకలాపాలు ప్రారంభం

తిరుపతి విద్య, జూలై 5, ప్రభాతవార్త

స్వచ్ఛమైన, సమర్థవంతమైన వంట గ్యాస్‌ని అందించే సౌలభ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశంలోని ప్రముఖ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ అయిన ఏజి అండ్ పి ప్రథమ్, ఎడిఫై స్కూల్ కిచెన్‌కి తమ తొలి వాణిజ్య పిఎన్‌జి కనెక్షన్ ద్వారా గ్యాస్ సరఫరాని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎడిఫై స్కూల్ ఛైర్మన్ ప్రణీత్‌తో పాటు ఏజిపి ప్రథమ్ సంస్థకు చెందిన సీనియర్ మేనేజ్మెంట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రీజినల్ హెడ్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజీడీ) నెట్ వర్క్‌ను అభివృద్ధి చేయాలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంకు అనుగుణంగా ఏజిఅండ్‌పి ప్రథమ్ సంస్థ ప్రయత్నం చేస్తోంది. స్వచ్ఛమైన వంట గ్యాస్‌ని నిరంతరం సరఫరా చేయడానికి, ఏజి, పి ప్రథమ సంస్థ తిరుత్తణి నుండి తిరుపతికి ట్రంక్ పైప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. ఇది తిరుపతిలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య, గృహ వినియోగదారులకు ఈ గ్యాస్‌ను అందిస్తుందన్నారు. పిఎన్‌జి కనెక్షన్‌ని పొందేందుకు ఆసక్తి కస్టమర్లు ఏజిఅండ్‌పి ప్రథమ్ సంస్థ కస్టమర్ కేర్ నంబర్‌ను 18002022999 సంప్రదించాలని కోరారు.

## స్టార్ హెల్త్ మొబైల్ యాప్ అందరూ వాడాలి

తిరుపతి విద్య, జూలై 5, ప్రభాతవార్త

భారతదేశంలోని అతి పెద్ద రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ భారతదేశంలోని 50కి పైగా నగరాల్లో తన హోమ్ హెల్త్ కేర్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ ఆనంద రాయ్ ప్రకటించారు. స్థానిక ఎస్వీ జూనియర్ కాలేజీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న నేటి వినియోగదారుల అవసరాలను తీర్చడంలో సాంకేతికత కీలకమని మేము విశ్వసిస్తున్నామన్నారు. గృహ ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రారంభించడం అనేది అందుబాటులో వున్న ఆరోగ్య సంరక్షణ పరిష్కారాల ద్వారా మెరుగైన అనుభవన్నా వినియోగదారునికి అందించేందుకు తీసుకుంటున్న చర్యలు మా నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు.

## రేమాండ్స్ అధినేత సింఘానియాతో ఈఓ చర్చలు

తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని రేమాండ్స్‌గ్రూప్ అధినేత సింఘానియా శుక్రవారం దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సింఘానియాను టిటిడి ఈఓ శ్యామలరావు మర్యాదపూర్వకంగా కలిసి టిటిడికి అందిస్తున్న సేవలపై చర్చించారు.

## అందరికీ మంచి జరగాలి

-ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు

తిరుమల,జులై 5ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని స్వామివారిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వేడుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో బిజెపి నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్, బోత్ ఆస్పత్రి అధినేత డాక్టర్ హరిప్రసాద్‌తో కలసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ

నగరి, జూలై 5 ప్రభాతవార్త:



మండలంలోని ఎం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి బి.నమఃశివాయం శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పాఠశాల విద్యార్థుల హాజరు సంఖ్య ఎంత మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం తింటున్నారు అనే అంశాన్ని పరిశీలించారు. బియ్యం, గుడ్లు, చిక్కి పెడుతున్నారా...లేదా...? అని ఆరా తీశారు. టేస్ట్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను, మధ్యాహ్న వంట గదిని పరిశీలించారు. మధ్యాహ్న రిజిస్టర్స్ అప్‌డేట్‌లో లేదని ప్రతి రోజు రోజువారి లెక్కలను నమోదు చేయాలన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయులు గీతాకుమారికి సూచించారు.

## నేటి నుంచి కుంభాభిషేక పూజలు

నగరి, జూలై 5 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధి పుదుపేట నాగాలమ్మ ఆలయంలో శనివారం నుంచి కుంభాభిషేక పూజలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు కుంభాభిషేక పూజలను వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆలయంలో నూతనంగా ప్రతిష్టించే దేవతామూర్తుల విగ్రహాలను ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం హోమ పూజలు, వాస్తు పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేస్తామని ఆదివారం మహా కుంభాభిషేకం, మహా అభిషేకం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## కొత్తగా అమలైన చట్టాలను గురించి అవగాహన అవసరం

ఏర్పేడు, జూలై5, ప్రభాతవార్త;



భారతదేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలని భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్ శ్రీనరసింహ శర్మ పేర్కొన్నారు. ఏర్పేడు మండల కేంద్రం సమీపంలో వెలసిన తిరుపతి ఐఐటిని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా సంస్థ యొక్క క్యాంపస్ అభివృద్ధి, విజయాలు, అవార్డుల గురించి ఆయనకు తెలియ జేశారు. 2024 జూలై1వ తేది నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాల గురించి అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా శ్రీశర్మ గారు మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత2023, భారతీయ సాక్ష్యా అధినియం 2023 అనే మూడు కొత్త చట్టాల యొక్క ముఖ్య లక్షణాలను గురించి వివరించారు. ఇది భారతీయ శిక్షాస్మృతి 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973,ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 ఆయన కొత్త చట్టాల ద్వారా మార్పులను భాగా వివరించారు.ఇందులో సమయానుకూలంగా న్యాయం అందించడం, పిల్లలు, మహిళలపై నేరాల పట్ల సున్నితత్వంపెరిగిందన్నారు.జీరోఇఎఫ్ఐఆర్ఎలక్ట్రానిక్ సాక్ష్యం చెల్లుబాటు అవుతుందన్నారు. ప్రొఫెసర్లు రామారావు, సుమిత్‌బిస్వాస్, చమన్ మెహతా, ఐఐటి సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త కలెక్టర్‌ని కలసిన జడ్పీటీసి తిరుమలయ్య

ఏర్పేడు, జూలై5, ప్రభాతవార్త;

ఏర్పేడు మండల జడ్పీటీసి సభ్యులు కావేరి తిరుమలయ్య శుక్రవారం తిరుపతి నూతన కలెక్టర్‌గా భాధ్యతలను చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వర్ ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. మండ లా నికి చేయవలసిన అభివృద్ధి పనులను గురించి ఆయనకు వివరించినట్లు తిరుమలయ్య పేర్కొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

విజయపురం, జూలై 5 ప్రభాతవార్త:



మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య చర్యలు నిర్వహించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని విజయపురం, జగన్నాథపురం, పన్నూరు, కోసలనగరంలో చెత్తాచదారం తొలగించి బ్లీచింగ్ చల్లారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9 నుంచి 19 తేదీ వరకు తిరుణాళ్ళ

పుత్తూరురూరల్, జూలై 5 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల ఆలయ తిరుణాళ్లు ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడానికి ఆలయ కోవిళ్ళ కార్లు నిర్ణయించినట్లు దేవాదాయశాఖ సూపరింటెండెంట్ సుమన్‌ప్రియ పేర్కొన్నారు. పుత్తూరులోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల ఆలయ తిరుణాళ్ళకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా ఆలయంకు సంబంధించిన స్థలంలో తిరుణాళ్ళ సందర్భంగా వేలం పాట నిర్వహించి అత్యధికంగా పాడుకున్న వారికి దుకాణాల నుంచి రుసుము వసూళ్ల చేసుకోవడానికి అనుమతి ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి రూ.10 లక్షలకు స్థలాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. అయితే డ్రా ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ డ్రాలో పాల్గొనే వారు తిరిగి ఇవ్వని డిపాజిట్ రూ.25 వేలు చెల్లించాలన్నారు. గతంలో అగ్నిగుండ ప్రవేశం చేసే వారు రూ.300లు చెల్లించేవారని, దాన్ని రూ.200కు తగ్గించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోవిళ్‌కార్ కృష్టప్పమొదలియార్, మున్సిపల్‌మాజీచైర్మన్‌యుగంధర్, ఉత్సవకమిటీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని వివిధ కళాశాలలు,పాఠశాలలకు చెందిన వాహన డ్రైవర్లకు శుక్రవారం మోటారు వాహన తనిఖి అధికారి దామోదర్‌నాయుడు అవగాహన తరగతులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తవిద్యసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా వాహనాలను నడిపేటప్పుడు ఏకగ్రతతో, దృష్టిని మొత్తం వాహనంపై ఉండాలని వాహనాలను వేగంగా నడపరాదన్నారు.వాహనాలను నడిపేటప్పుడు సెల్ వాడకం పూర్తిగా నిషిద్ధలన్నారు.ప్రతి వాహనంలో డ్రైవర్‌తో పాటు ఓ అటెండర్ ఉండాలని విద్యార్దులు వాహనాలు ఎక్కేటప్పుడు,దిగినప్పుడు వారికి సహాయపడాలన్నారు.

## శివయ్య సేవలో తెలంగాణ అధికారి

శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త



పంచభూతలింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని శుక్రవారం తెలంగాణ ఇన్‌కంటాక్సు ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాళి మధుస్మిత కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారి రాక సందర్భంగా ఆలయం వద్ద శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డిస్వాగతం ఏర్పాట్లు చేసారు.వారికి ప్రోటోకాల్‌మేరకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, పిఆర్‌ఓ నాగభూషణం నాయక్, రవి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత ఆమెకు మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు. స్వాగతం పలికిన వారిలో రిషితారెడ్డితో పాటు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షులు రంగినేని చెంచయ్యనాయుడు ఉన్నారు.

## తొట్టంబేడు మండలానికి సర్వేయర్ కావలెను?

తొట్టంబేడు, జూలై 5 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంకు సర్వేయర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఇక్కడ మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న మోహనకృష్ణ కడప కార్పొరేషన్‌కు బదిలీ ఆయ్యారు. దీంతో ఇక్కడకు సర్వేయర్‌గా దేవానంద్‌ను నియమించారు. సుమారు 4నెలల పాటు పనిచేసిన ఆయన తిరిగి ఎడిఎ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం మండల ఇన్‌ఛార్జి సర్వేయర్‌గా పెళ్ళకూరు మండల సర్వేయర్ పూజిత వ్యవహరిస్తున్నారు. ఇక 16మంంది మండల సర్వేయర్లు పనిచేస్తున్నారు. తొట్టంబేడు మండలంలో ఏ పనులు చేయాలన్నా సచివాలయ సర్వేయర్లు దిక్కుగా మారారు. అంతేకాకుండా తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో కూడా వీరితోనే పని.చేయించుకుంటారు. ఇక కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండ లాల్లో కూడా మండల సర్వేయర్లు లేరు.ఇకనైనా ఉన్నతాధికారులకు స్పందించి చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తిరుపతి డివిజన్

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

పుత్తూరు, జూలై 5 ప్రభాతవార్త :

వందేభారత్ రైలు కింద పడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. ఉత్తరపుకండ్రిగకు చెందిన ఎ.నారాయణమూర్తి (30) శుక్రవారం ఉదయం ఏడు గంటలకు పుత్తూరు రైల్వే స్టేషన్ సమీపంలో రేణిగుంట వైపు వెళుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కిందకు దూకాడు. తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌వి జూనియర్ కళాశాలలో ముగిసిన అడ్మిషన్స్ ప్రక్రియ

తిరుపతి విద్య, జులై 5, ప్రభాతవార్త

2024 - 2025 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను ఎస్‌వి జూనియర్ కళాశాల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా అన్ని గ్రూపుల్లో కాలేజ్, హాస్టల్ సీట్లు పూర్తిస్థాయిలో ముగిసినవని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు పత్రికా ప్రకటనలో వెలువరించారు. మొదటి మూడు విడతల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికన నిర్వహించి తదుపరి మిగిలిన కళాశాల సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ముందుగా తిరుపతి స్థానిక విద్యార్థులకు, స్థానికేతర విద్యార్థులకు, పదవ తరగతి మార్కుల ప్రాధాన్యత ప్రాతిపదికన పూర్తి గావించడమైనది. ప్రవేశాల ప్రక్రియకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి కళాశాల కార్యకలాపాల నిర్వహణకు సహకరించగలరని తెలియజేసారు.

## రూ.11 లక్షలు విలువ చేసే ఎర్రదుంగలు పట్టివేత

కేవీబీపురం, జూలై 5 ప్రభాతవార్త:

మండలంలోని శ్రీనివాసపురం(మారప్పరెడ్డి కండ్రిగ) గ్రామం వద్ద 11 లక్షల రూపాయలు విలువ చేసే ఎర్రచందనంతో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు రేంజర్ మాధవి, ఎఫ్ఎస్‌వో చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన రహస్య సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది గురువారం కేవీబీపురం నుంచి పిచ్చాటూరు వైపు గస్తీ నిర్వహిస్తూ ఉండగా శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో టీఎన్ 20 డీహెచ్ 2826 నెంబరు గల బొలెరో వాహనంలో అక్రమ రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న 45 ఎర్రచందనం దుంగలు( వాటి బరువు 278)తో పాటు పట్టుబడిన వాహనంతో సహా సుమారు రూ.11 లక్షలు విలువ చేస్తుందని తెలిపారు. చిన్నబ్బ అనే వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు సురేష్‌కుమార్, నీలకంఠం, గోపి, రఘు, మహేంద్ర, భోగరాజు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్, పార్కింగ్ స్థలాలకు టెండర్లు స్వీకరణ

కమిషనర్ అధితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, జులై 5, ప్రభాతవార్త



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మార్కెట్లకు, పార్కింగ్ స్థలాలకు సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలమునకు ఈ నెల 13 నఉండి దరఖాస్తు చేసుకోవచ్చునని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అతిధి సింగ్ తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ సముదాయము, రామచంద్ర గుంటకట్ట కూరగాయల మార్కెట్, జంతు వధశాల, పార్కింగ్ స్థలాలకు మార్చి 31, 2025 వరకు రుసుము వసూలు చేసుకొనుట కొరకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల జులై 16వ తేది పూర్తి చేసిన టెండర్లను స్వీకరిస్తామని, తదుపరి సీల్ట్ టెండర్, బహిరంగ వేలం పద్ధతిలో ఈ నెల జులై 18వ తేది ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని కమిషనర్ అతిధి సింగ్ తెలిపారు.

## ఎస్పీతో భేటి అయిన ఎంపి మద్దిల గురుమూర్తి

తిరుపతి కార్పొరేషన్, జులై 5, ప్రభాతవార్త



తిరుపతి నూతన ఎస్పి హర్షవర్ధన్ రాజుతో తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి శుక్రవారం కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై దాడులు నివారించాలని అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి పట్టణం ఆధ్యాత్మిక నగరం మాత్రమే కాకుండా తిరుపతి చుట్టు పక్కల ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు నిలయంగా ఉందని ఇటువంటి ప్రాంతంలో గంజాయి, మాదకద్రవ్యా లు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నిబంధనలకు విరుద్ధంగా కొళాయి కనెక్షన్లు

ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రక్షాళన

రేణిగుంట, జూలై 5 ప్రభాతవార్త:



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో రేణిగుంట పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నిరంతర నీటి సరఫరా కొళాయి(24 గంటల నీటి సరఫరా కొళాయి) కనెక్షన్లను పంచాయతీ అధికారులు చెక్ పెట్టారు. వీటిలో ప్రధాన వ్యక్తులు ప్రజాప్రతినిధులు కావడం గమనార్హం. రేణిగుంట పంచాయతీలోని అనేక వీధుల్లో ప్రజలు నీటి కోసం కటకటలాడుతుంటే మరో వైపు కొంత మంది ప్రజాప్రతినిధులు, వారికి అనుకూలమైన వ్యక్తులు ఇలా కనెక్షన్లు తీసుకుని పంచాయతీలో కృత్రిమ నీటి కొరతను సృష్టిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రేణిగుంట పోస్టాఫీసు వీధిలో తెల్ల రేషన్ కార్డు ఉన్న నిరుపేద వ్యాపారస్తుడు తన బిల్డింగ్‌కు రెండు వైపుల నుంచి నీరు వచ్చే లైన్ల నుంచి 24 గంటల కొళాయి కనెక్షన్లు రెండు తీసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఔరా ఇదేమీ చోద్యం అంటూ అందరూ ముక్కుపై వేలు వేసుకుంటున్నారు. ఇలాంటి కనెక్షన్లు రేణిగుంట పంచాయతీలో దాదాపు వందల సంఖ్యలో ఉన్నాయంటూ చర్చించుకుంటున్నారు. రేణిగుంటలో ఏర్పడిన కృత్రిమ నీటి కొరత విషయం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలియడంతో ఈ విషయాన్ని ఆయన చాలా సీరియస్‌గా తీసుకుని వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ అధికారులను ఆదేశించడంతో యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ అధికారులు వాటర్ వర్క్ సిబ్బందితో కొళాయిల కనెక్షన్లను తొలగించడానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఏడు కనెక్షన్లను తొలగించి వాటి స్థానంలో సాధారణ కనెక్షన్లను ఇచ్చారు. ఎవరైనా సరే నీటి దొంగతనానికి పాల్పడితే చర్యలు తీసుకోక తప్పదని పంచాయతీ అధికారులు హెచ్చరించారు.

## నారా చిన్నబ్బనాయుడుకు ఎంఎల్‌ఏ పులివర్తి నాని నివాళి

చంద్రగిరి, జూలై 5 ప్రభాతవార్త:



నారావారిపల్లికి చెందిన నారా చిన్నబ్బ నాయుడు భౌతికకాయంపై ఎంఎల్‌ఏ పులివర్తి నాని పూలమాలవేసి నివాళులర్పించారు. నారా చిన్నబ్బ నాయుడు అలియాస్ ప్రభాకర్ నాయుడు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంఎల్‌ఏ మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. శుక్రవారం నారావారిపల్లికి చేరుకున్న ఆయన నారా చిన్నబ్బ నాయుడు పార్టీకి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, నాయకులు ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, తానికొండ కేశవులు నాయుడు, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి, జూలై 5 ప్రభాతవార్త:



గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న సురేంద్ర (45) మృతి చెందిన విచారకర దుర్ఘటన నాగయ్యగారిపల్లి వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి నాగయ్యగారిపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న సురేంద్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సిఐ రామయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ రవీంద్రనాథ్ సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

వడమాలపేట, జూలై 5 ప్రభాతవార్త:

పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే అంటు వ్యాధులను నివారించవచ్చునని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సీతారామపురంలో చెత్త బుట్టలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతిభా రత్నం, నాయకులు వెంకటయ్య, గోపాల్‌నాయుడు, దేవ, హరినాయుడు, తిరుమల నాయుడు, బాబునాయుడు, రాజేంద్ర, ఎల్లప్ప నాయుడు, రమేష్, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నూతన హాస్టళ్ల భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



హాస్టల్‌లో బాత్రూములు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూలై 5 ప్రభాతవార్త

కుప్పం పట్టణం పాతపేటలో ఉన్న ఎస్సీ, బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నూతన భవనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్థానిక నేతలు, అధికారులతో కలసి పాతపేటలోని ఎస్సీ, బిసి సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. హాస్టళ్ల భవనాలకు శిథిల దశకు చేరడంతో సుమారు రెండు వందల మంది విద్యార్థులు హాస్టళ్లలో ఉండేలా అవసరమైన నూతన హాస్టళ్ల భవనాలకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఈసందర్భంగా హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు బెడ్లు సరఫరా చేయాలని ఆదేశించారు. హాస్టళ్లలోని మరుగుదొడ్లను, స్నానపు గదులను కలెక్టర్ పరిశీలించారు. హాస్టళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అలాగే పరిసర ప్రాంతాల్లో దోమల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా హాస్టళ్ల కిటికీలకు మెష్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రోజువారీ ఆహారాన్ని నిర్ణీత వేళల్లో అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసే కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులకు సకాలంలో అందేలా చూడాలని వార్డెన్లకు సూచించారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు సైతం నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో ప్రవహించే పాలారు నదిపై ఉన్న చెక్‌డ్యాములను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సురేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను కౌన్సిల్‌లో చర్చించి ఆమోదిస్తాం

## కమిషనర్ అధితి సింగ్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అధితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, జులై 5, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదిస్తామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌లో వున్న కర్నాల వీధి రైల్వే అండర్ బ్రిడ్జ్ పరిసరాలను, రైల్వే స్టేషన్ కార్నర్ నుండి కస్తూఇ భాయ్ నందు, పల్లి వీధి పరిసరాలను స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నరసింహాచారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహాచారి మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మించడం సంతోషమని అయితే కస్తూరి బాయ్ సంధు నుండి పల్లివీధికి అటు ఇటు ప్రజలు తిరిగేందుకు ఇబ్బందిగా ఉందని, ఈ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురావడం చేసామని, బ్రిడ్జ్ వద్ద నడక దారి బ్రిడ్జి నిర్మించేందుకు ఆమోదం తెలపడం జరిగినా, ఇంత వరకు పనులు ప్రారంభించలేదని చెప్పడంతో, అందుకు స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కస్తూరి భాయ్ సంధులో గతంలో కాలువ వుండేదని తిరిగి ప్రజల కోసం నిర్మించాలని చెప్పడంతో కమిషనర్ స్పందిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ పరిశీలించి నివేదిక తయారు చేయమన్నారు. అలాగే అక్కడే వున్న కర్మక్రియలు జరిపే స్థలాన్ని పరిశీలించారు. కర్మక్రియలకు కొంచెం విశాలమైన భవన కావాలని 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి, 23వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి కుమారుడు మోహన్ కోరడంతో, పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, డిఈలు మహేష్, తేజస్వీ, శానిటరీ సూపర్ వైజర్ చెంచెయ్య, శానిటరి ఇన్స్పెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు - ఫిర్యాదుదారులపై దురుసు ప్రవర్తన

## శ్రీకాళహస్తి అర్బన్ సిఐ, ఎస్ఐపై ఎస్పికి ఫిర్యాదు

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి అర్బన్ స్టేషన్‌లో అధికారులు గతంలో పరిపాలించిన వైకాపా నాయకులతో అంటకాగి వారిని ప్రజలుతిరస్కరించినా పోలీసోళ్ళ తీరుమారలేదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేసారు. వారి ఫిర్యాదుమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసు స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్ళిన ఓ మహిళపై సిఐ నరసింహారావు, ఎస్ఐ అరుణ అమానుషంగా, బాధ్యతారాహిత్యంగా, దురుసుగా వ్యవహరించారని ఎస్పికి ఫిర్యాదు చేసారు. ఓ మహిళకు సంబంధించి అన్యాయం జరిగినట్లు ఫిర్యాదు అందగా విచారించటానికి పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన మహిళతో సిఐ ఎస్ఐలు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జనసేన పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుసుకొని తాను వెళ్ళి సిఐను మహిళ ఫిర్యాదును ఎందుకు తీసుకోలేదు? అని ప్రశ్నించగా ఓ పార్టీ నాయకురాలు మహిళ అని కూడా చూడకుండా సిఐ నరసింహారావు అమర్యాదగా ప్రవర్తించారని ఎస్పి హర్షవర్ధన్‌రాజుకు రాతమూలకంగా ఫిర్యాదు చేసారు. ఏడు రోజులుగా మహిళకు సంబంధించిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేయక వేధించిన సిఐ ఎస్ఐ శుక్రవారం తాము ఎస్పికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలుసుకొని అర్ధరాత్రి 11.30గంటలకు ఎఫ్ఐఆర్ చేసారని వినూత ఎస్పికి ఫిర్యాదు చేసారు. వన్‌టౌన్ సిఐ ఎన్నికల ముందు ప్రభుత్వంతో అంటకాగిన పలువురు నియోజకవర్గంలోని పోలీసు అధికారులకు సంబంధించి కూడా ఫిర్యాదు చేసినట్లు వినూత పత్రికల వారికి వివరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఓ మహిళకు పార్టీ నాయకురాలిగా తనకు జరిగిన అన్యాయం అవమానంపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేసారు. తాను విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పి భరోసా ఇచ్చినట్లు వినూత తెలిపారు.



స్పికి పిర్యాదు చేస్తున్న వినూత కోట

# పదిహేను గ్రానైట్ క్వారీల్లో మైనింగ్ అధికారుల సర్వే

## - క్షేత్రస్థాయి పరిశీలనపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక !!



కుప్పం, జూలై 5 ప్రభాతవార్త

కుప్పం, శాంతిపురం మండలాల్లో ఉన్న పదిహేను గ్రానైట్ క్వారీలను శుక్రవారం పలమనేరు మైనింగ్ ఎడి వేణుగోపాల్ అధ్వర్యంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. నిర్వహణలో ఉన్న, ఆగిపోయిన క్వారీలను, క్వారీల్లో నిల్వ ఉన్న రాతి శ్లాబ్‌లను అధికార యంత్రాంగం పరిశీలించి రికార్డులు నమోదు చేసుకున్నారు. అలాగే ఆయా క్వారీలకు కేటాయించిన విస్తీర్ణం, క్వారీల్లో తవ్వకాలు జరిగిన విస్తీర్ణం, హద్దులను గుర్తించి వివరాలు నమోదు చేశారు. శనివారం సైతం పలు క్వారీల్లో సర్వే చేపట్టడం జరుగుతుందని అనంతరం క్షేత్రస్థాయిలో సేకరించిన క్వారీలకు సంబందించిన పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని ఎడి వేణుగోపాల్ 'ప్రభాతవార్త'కు తెలిపారు. కాగా ఇప్పటికే గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ఉన్న పలు గ్రానైట్ క్వారీల్లో సర్వే పూర్తయిన విషయం విదితమే.

# రాష్ట్రపతి భవన్ అధికారి దర్శనం



శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని శుక్రవారం రాష్ట్రపతి భవన్ సహాయ కార్యదసమేతంగా స్వామి అమ్మవార్ల దర్వనానికి వచ్చారు. వారికి ప్రోటోకాల్‌మేరకు ఎఇఓ సతీష్‌మాలిక్, పిఆర్ఓలు నాగభూషణం నాయక్, రవిలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనం తరువాత మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించండి

## - జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట, జూలై 5 ప్రభాతవార్త:

విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన నాణ్యమైన విద్యను బోధించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల చుట్టు పక్కల పరిసరాల పారిశుధ్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు విద్యాబోధన, ఆరోగ్యం, పరిసరాల శుభ్రతపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన యూనిఫాం, బూట్లు, బ్యాగులు, విద్యా సామగ్రి సత్వరమే ఇవ్వాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని తెలిపారు. విద్యార్థులకు పెడుతున్న ఆహారంపై ఆరా తీశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన పద్ధతిని గమనించారు. బోధనపై వారికి తగిన సూచనలు చేశారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థులను వెంటనే పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణను సెల్‌ఫోన్ ద్వారా ఆదేశించారు. భోజనశాల, వంట, వసతి, స్నానాల గదులతో పాటు మరుగుదొడ్లను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లోని స్థానిక వివరాలను తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు హాస్టల్‌కు వార్డెన్ లేడు అనడంతో లేకపోతే ఎలా అంటూ ప్రిన్సిపాల్ హరిబాబును ప్రశ్నించారు. విద్యార్థులకు విద్య బోధించడంతో పాటు ఆరోగ్యం, భోజన, వసతి ఏర్పాట్లు పట్ల జాగ్రత్త తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

# మొక్కు తీర్చుకున్న టిడిపి నేతలు

పుత్తూరు, జూలై 5 ప్రభాతవార్త :



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి, గాలి భాను ప్రకాశ్ నగరి ఎమ్మెల్యే అవ్వాలని మొక్కుకున్న మేరకు శుక్రవారం గేట్ పుత్తూరులోని గోవిందమ్మ గుడిలో మణి తన కుటుంబ సమేతంగా మొక్కు తీర్చుకున్నారు. వికలాంగుడైన మణి తనకు వచ్చిన పెన్షన్ డబ్బుతో గోవిందమ్మ అమ్మవారికి అభిషేకం చేసి తెలుగుదేశం పార్టీపై తన అభిమానం చాటుకున్నారు. చంద్రబాబు, భానుప్రకాశ్ ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారికి ప్రార్థించారు. కార్యక్రమంలో పదో వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ డి.జి.ధనపాల్, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, నగరి నియోజకవర్గ బిసి సెల్ కార్యదర్శి డి.శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాపు కార్పొరేషన్ చైర్మన్ రాయలసీమ బలిజలకు ఇవ్వాలి

## బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్



తిరుపతి హెల్త్, జులై 5, ప్రభాతవార్త

తిరుపతి ఎన్‌జిఓ కాలనీలోని ఆరణి శ్రీనివాసులు నివాసానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ విచ్చేసారు. విరిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను పరిచయం చేశారు. అనంతరం మంత్రిని లేఖ ద్వారా కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాయలసీమ బలిజలకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఎన్నో ఏళ్ళ నుండి రాయలసీమ ప్రాంతంలో బలిజలు అటు ఆర్థికంగా ఇటు రాజకీయంగా అణిచివేతకు గురి అయ్యారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం బలిజల పట్ల చిన్నచూపు చూసిందని, ఒక్క డైరెక్టర్ పదవి కూడా ఇవ్వలేదని ఆవేదనను వెలిబుచ్చారు. యువనాయకత్వాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి కాపు కార్పొరేషన్ చైర్మన్ మంత్రిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ సురేష్, తిరుమల అధ్యక్షులు కలల హరిప్రసాద్, తోట జయంతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య దర్శనానికి విచ్చేసిన అమరావతి మహిళా రైతులు



శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం అమరావతి మహిళా రైతులు విచ్చేశారు. వీరికి ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి ఆలయం వద్ద స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అమరావతి రైతులు పేర్కొన్నారు. అనంతరం వీరికి తీర్థప్రసాదాలు అందించారు. కాగా ఊరందూరు గ్రామంలోని ఎంఎల్ఏ ఇంట్లో తేనీటి విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, భారత్‌గ్యాస్ కృష్ణపాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2కోట్లుతో విద్యుత్ కార్యాలయ భవనాలు సిద్ధం



తొట్టంబేడు, జూలై 5 ప్రభాతవార్త

ఏళ్ళ తరబడి పాడుబడిన భవనాల్లో ఉన్న విద్యుత్ అధికారుల కష్టాలు ఇకపై తీరనున్నాయి. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తి-చెన్నైరోడ్డులో ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో రూ.2కోట్లతో ఎఈ కార్యాలయాలుతో పాటు డిఈఈ కార్యాలయాలతో పాటు రెవెన్యూ కార్యాలయాలను కాంట్రాక్టర్ పూర్తిచేశారు. ఇక వర్షాకాలంలో కార్యాలయంలోకి అడుగుపెట్టాలంటే రోడ్డు మొత్తం బురదమయం కావడంతో పాటు సిబ్బంది పనిచేస్తున్న కార్యాలయాల్లో కంప్యూటర్లు తడసిపోవడంతో మరమ్మత్తులకు గురై పనికిరాకుండా పోతున్నాయి. ఈవిషయాలను ప్రస్తుత అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో స్పందించిన వారు కొత్త భవననిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో రూ.2కోట్లుతో కొత్తగా భవనాలను నిర్మించారు. అంతేకాకుండా కార్యాలయ ఆవరణలో మెగా కంపెనీ సహకారంతో చక్కగా బిటిరోడ్లును వేయించారు. ఇక కొత్తకార్యాలయాల భవనాలు త్వరలోనే ప్రారంభిస్తే ఇటు సిబ్బందికి, అటు విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. త్వరలోనే ఈభవనాలను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

# శివయ్యసేవలో సినీ దర్శకులు



శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తాను నిర్మించనున్న కొత్త సినిమా స్క్రిప్టుకు ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ ప్రతినిధి చందూ రాయల్ సారధ్యంలో దర్శనం ఏర్పాటు చేసారు. త్వరలో అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నారు' అనే ఫ్యామిలీ డ్రామాను రూపొందించి స్క్రిప్టు తయారు చేసారు. దీనిని ఆలయంలోని దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి పాదాల చెంత పెట్టి పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. తన సినిమా విజయవంతం కావాలని స్వామి అమ్మవార్లను వేడుకున్నట్లు అనిల్ వివరించారు.

# అమావాస్య గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, జూలై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు సారధ్యంలో అమావాస్య ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామి అమ్మవార్లను సప్పరంలో ప్రతిష్టించి కేరళ పంచవాయిద్యాలు, సంప్రదాయ డోలు సన్నాయి మోగుతుండగా ఉభయదారులు వెంటరాగా ఉత్సవాన్ని తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధి, బజారు వీధులమీదుగా సాగింది. ఉత్సవం సకాలంలో రావటంతో స్థానిక భక్తులే కాకుండా తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన వారు కూడా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

# లడ్డూపోటులో మెరుగైన సౌకర్యాలు : ఇఓ



తిరుమలలో లడ్డూతయారీలో కీలకమైన బూందీపోటులో సౌకర్యాలు, కార్మికులసమస్యలు పరిష్కరిస్తామని టిటిడి ఈఓ శ్యామలరావు తెలిపారు. పోటుకార్మికులతో సమావేశమై రుచికరమైన లడ్డూతయారీపై సమీక్షించారు.

ప్రభాతవార్త-తిరుమల

# కుప్పం రెస్కో ఉద్యోగులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

## - తొలిరోజు 108మంది హాజరు.. జాయింట్ కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక !!



శాంతిపురం, జూలై 5 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో పనిచేస్తున్న 121మంది రెగ్యులర్ ఉద్యోగులకు జాయింట్ కలెక్టర్, రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులను శుక్రవారం శాంతిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. తొలిరోజు 109మందికి గాను 180మంది అసిస్టెంట్ హెల్పర్లు, బిల్ కలెక్టర్లుగా ఉన్న రెస్కో ఉద్యోగులు ఈ టెస్టులకు హాజరయ్యారు. వీరికి విద్యుత్ స్థంభాలు ఎక్కడం, మీటర్ రీడింగ్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ నిర్వహణ తదితర ఐదు అంశాల్లో సామర్థ్య నిర్వహణ పరీక్షలను నిర్వహించారు. శనివారం ఆఫీసు సిబ్బందిగా పనిచేస్తున్న మరో 12మందికి సైతం ఈ ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించనున్నారు. కాగా ఈ పరీక్షలు నిర్వహించిన అనంతరం పూర్తిస్థాయి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందిస్తామని రెస్కో ఎండి ప్రభాకర్ తెలిపారు. కాగా వైకాపా పాలనలో రెస్కోలో ఇష్టారాజ్యంగా అప్పటిపాలకవర్గం, అధికారులు ఉద్యోగాలు కల్పించారని తగిన అర్హతలు లేకున్నా ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా నియామకాలు చేపట్టారని రెస్కోలో జరిగిన కోట్ల రూపాయల అవినీతిని వెలికితీస్తామని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఇదివరకే ప్రకటించిన విషయం విదితమే. రెస్కోలో వైకాపా నేతల బంధువులు, అనుయాయులకు ఉద్యోగాలు కల్పించారనే విమర్శలు సైతం ఉన్నాయి. వారి నుంచి భారీగా ముడుపులు సైతం స్వీకరించి ఉద్యోగాల్లో నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో వైకాపా పాలనలో ఉద్యోగాలు పొంది పర్మినెంట్ అయిన వారి సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహిస్తున్నారు.